సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



క్షణాల్లో మిర్చి నాణ్యత
సాగు–బాగు కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థ క్షణాల్లో మిర్చి నాణ్యత పరిశీలించే యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. 10లో



సింగరేణి డైరెక్టర్ పర్యటన
కోయగూడెం ఓసీలో సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి పర్యటించి రోజువారీ బొగ్గు ఉత్పత్తి, రవాణాపై సమీక్షించారు. 10లో

గరిష్టం / కనిష్టం
36° / 22°

వాతావరణం
జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు గంటగంటకూ పెరుగుతాయి. రాత్రి వాతావరణం మాత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామాలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో బుధవారం చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అదేవిధంగా స్వామి వారికి స్నపన తిరుమంజనం గావించారు.

రెవెన్యూ శాఖలో బదిలీలు
సూపర్‌బజార్(కొత్తగూడెం): రెవెన్యూ శాఖలో బదిలీలు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా విధులు నిర్వహిస్తున్న పర్సా రాంబాబు జగిత్యాల అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ములుగు అదనపు కలెక్టర్ డి.వేణుగోపాలరావు రానున్నారు. ఇక భద్రాచలం ఆర్డీఓ ఎం.మంగీలాల్ భూపాలపల్లి ఆర్డీఓగా బదిలీ కాగా, నల్గొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఆర్‌అండ్‌ఆర్ ఎల్‌ఏ యూనిట్-2)గా ఉన్న కొల్లు దామోదర్‌రావు భద్రాచలం ఆర్డీఓగా నియమితులయ్యారు.

‘మోడల్’లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
భద్రాచలం: జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న మోడల్ స్పోర్ట్స్ స్కూళ్ల కిన్నెరసాని(బాలురు), కాచనపల్లి(బాలికలు), వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయిన్‌పల్లి, హైదరాబాదులో ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు జిల్లా విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 ఏళ్ల వయసు గల విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో మార్చి 5 నుంచి 7 వరకు కిన్నెరసాని మోడల్ స్కూల్‌లో జరిగే ఎంపికలకు హాజరు కావాలని సూచించారు. ఇక్కడ బ్యాటరీ టెస్ట్ (9 అంశాలు)లో ప్రతిభ కనబర్చిన వారికి మార్చి 26 నుంచి 28 వరకు అదే పాఠశాలలో ఎంపికలు నిర్వహిస్తామని, అర్హత సాధించిన వారికి ఐదో తరగతిలో ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని పీఈటీలు, హెచ్‌ఎంలకు సూచించారు.

73 పోస్టులు.. 4,464 దరఖాస్తులు
కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 73 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, బుధవారం గడువు ముగిసే సమయానికి 4,464 దరఖాస్తులు వచ్చాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్‌నర్సు పోస్టులు 30కి 2,500, ఏఎన్‌ఎం మూడు పోస్టులకు 763, ల్యాబ్ టెక్నీషియన్ 303, ఫార్మసిస్ట్ మూడు పోస్టులకు 418, ఎంఎల్‌హెచ్‌పీ 25 పోస్టులకు 400, వైద్యులు ఆర్‌బీఎస్‌కే మేల్ 1, ఫిమేల్ 2 పోస్టులకు 80 మంది దరఖాస్తు చేశారని వివరించారు. భర్తీ ప్రక్రియ కలెక్టర్ ప్రియాంక అల సమక్షంలో మెరిట్ ఆధారంగా పారదర్శకంగా సాగుతుందని, ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామంటూ డబ్బులు అడిగితే నమ్మొద్దని, తమకు ఫిర్యాదు చేస్తే అలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సీడ్ డీలర్‌షిప్‌కు అవకాశం
ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో సీడ్ లైసెన్స్ కలిగి ఉన్న వ్యాపారులకు డీలర్‌షిప్ అవకాశం ఇవ్వనున్నట్లు రీజనల్ మేనేజర్ ఎస్.బిక్షం తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యమైన విత్తనాలు విక్రయించేందుకు డీలర్ షిప్‌లు ఇస్తామని పేర్కొన్నారు. సీడ్ లైసెన్స్ కలిగిన వ్యాపారులు వివరాల కోసం 98499 08760 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

1 నుంచి ఉచిత విద్యుత్
సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో తెల్లరేషన్ కార్డు ఉండి, అర్హులైన విద్యుత్ వినియోగదారులకు మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు జీరో బిల్లు ఇస్తామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ కె. రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోకున్నా, దరఖాస్తులో వివరాలు సరిగా నమోదు చేయక లబ్ధి పొందకున్నా తమ పరిధిలోని ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నంబర్, తెల్లరేషన్‌కార్డుతో అనుసంధానమైన ఆధార్‌కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

దయచేసి చెప్పండి!



అయోధ్యలో బాల రాముడిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను నడిపిస్తోంది. అయితే ఈ రైళ్లకు సంబంధించిన కనీస సమాచారాన్ని కూడా భక్తులకు చేరవేయడం లేదు. దీంతో బాల రామున్ని కనులారా దర్శించుకుందామనుకునే భక్తుల ఆశలు నిరాశలు అవుతున్నాయి.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

భద్రాద్రి నుంచి అయోధ్యకు మరో రైలు
- నేటి మధ్యాహ్నం కొత్తగూడెం నుంచి మొదలు
- కనీస ప్రచారం చేయని రైల్వే, ఐఆర్‌సీటీసీ
- టికెట్ల బుకింగ్‌పై బీజేపీదే పెత్తనం ?
- చివరి నిమిషంలో రద్దవుతున్న భక్తుల టికెట్లు

నేడు ప్రత్యేక రైలు

భద్రాచలం రోడ్ స్టేషన్ నుంచి అయోధ్య (సలార్‌పూర్) వరకు ఆస్తా పేరుతో ప్రత్యేక రైలు గురువారం మధ్యాహ్నం బయలుదేరనుంది. ఈ రైలులో మొత్తం 20 కోచ్‌లు ఉండగా ప్రతీ కోచ్‌లో 92 మంది భక్తులు ప్రయాణించే వీలుంది. ఈ రైలులో అయోధ్యకు వెళ్లేందుకు కొత్తగూడెం నుంచి భారీ ఎత్తున భక్తులు ముందుకొచ్చారు. అయితే చివరి నిమిషంలో టికెట్లు కన్‌ఫర్మ్ కాలేదని చెప్పారు. దీంతో ఒక్క కొత్తగూడెంలోనే 200 మందికి పైగా భక్తులకు టికెట్లు దక్కలేదని తెలుస్తోంది. రాముడిని దర్శించుకోవాలనే తలంపుతో రెండు వారాలుగా అన్నీ సిద్ధం చేసుకున్నామని, చివరి నిమిషంలో టికెట్ దక్కలేదని చెప్పడం బాధగా ఉందని భక్తులు వాపోతున్నారు.

బుకింగ్ పనుల్లో బీజేపీ..

ప్రత్యేక రైళ్లకు సంబంధించిన అధికారిక సమాచారం రైల్వే నుంచి అందుబాటులో లేకుండా పోయింది. దీంతో నోటి మాట ద్వారానే భక్తులకు సమాచారం తెలుస్తోంది. అయోధ్యకు వెళ్లాలనుకునే భక్తులు భారతీయ జనతా పార్టీకి సంబంధించిన నేతలను కలిస్తే టికెట్లు దొరుకుతున్నాయని చెబుతున్నారు. దీంతో గత కొద్ది రోజులుగా టికెట్ల కోసం వందలాది మంది భక్తులు బీజేపీ నేతలు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయోధ్య రైళ్లకు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్‌తో కొందరు టికెట్లను ‘బ్లాక్’ చేసి జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు బీజేపీ నేతలపై వస్తున్నాయి.

చివరి నిమిషంలో రద్దు

అయోధ్య రైళ్లకు ఉన్న డిమాండ్ దృష్ట్యా వందలాది మంది భక్తులు బీజేపీ కార్యాలయంలో, నేతలకు టికెట్ల కోసం డబ్బులు ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే గురువారం ప్రయాణం ఉండగా బుధవారం రోజున 200 మందికి పైగా భక్తుల టికెట్లు రద్దయ్యాయనే కబురు బయటకు వచ్చింది. చివరి నిమిషంలో తమ టికెట్లు క్యాన్సిల్ అయ్యాయంటూ బీజేపీ నేతలు చెబుతుండడంతో భక్తుల నుంచి నిరసన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే టికెట్ల బుకింగ్‌పై రైల్వేశాఖకు స్పష్టమైన విధానం లేకుండా పోయిందని, కనీసం అయోధ్య రైలు ప్రయాణ బాధ్యతలు చూస్తున్న బీజేపీ నేతలైనా పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తే బాగుండేదని భక్తులు అంటున్నారు. మరోవైపు అయోధ్య రైళ్లకు సంబంధించిన విషయంలో రైల్వేశాఖ అనుసరిస్తున్న తీరుపై నలువైపులా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంతా అయోమయం..

రైల్వేశాఖ ఏదైనా రైలును ప్రారంభిస్తే అందులో ప్రయాణించే వారు టికెట్లు బుక్ చేసుకోవాలంటే రైల్వే స్టేషన్లలో ఉన్న రిజర్వేషన్ కౌంటర్లు లేదా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న రిజర్వేషన్ సెంటర్లను ఆశ్రయిస్తారు. లేదంటే రైల్వే అనుబంధ సంస్థగా ఉన్న ఇండియన్ రైల్వేస్ కేటరింగ్ టూరింగ్ కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకునే వీలుంది. కానీ అయోధ్యకు నడుస్తున్న ఆస్తా ప్రత్యేక రైళ్లకు ఇవేవీ అందుబాటులో లేవు. స్టేషన్‌కి వెళ్లి అడిగితే ఐఆర్‌సీటీసీలో బుక్ చేసుకోమని సూచిస్తున్నారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో అసలు ఈ రైలుకు సంబంధించిన సమాచారమే లేదు. దీంతో సామాన్య భక్తులు టికెట్ బుక్ చేసుకోలేకపోతున్నారు.

ప్రాధాన్యత ఉంటుంది

భద్రాచలం రోడ్ స్టేషన్ నుంచి వెళ్లేందుకు 402 టికెట్లకు భక్తులు డబ్బులు కట్టారు (ఒక్కొక్కరికి రానుపోను రూ.1,800). అయితే రైల్వేశాఖలో దొర్లిన సమాచార లోపంతో ఖమ్మం మీదుగా వెళ్లే రైలుకు సంబంధించిన టికెట్లు భారీగా బుక్ కాలేదు. దీంతో భద్రాచలంరోడ్ స్టేషన్ నుంచి వెళ్లే రైలుపై ఒత్తిడి పెరిగింది. ఇక్కడి నుంచి 198 బెర్తులే రిజర్వ్ అయ్యాయి. చివరి నిమిషంలో 202 టికెట్లు రద్దయ్యాయి. వీరి టికెట్ సొమ్ము మొత్తం తిరిగి ఇచ్చేస్తున్నాం. డబ్బు వాపస్ వద్దన్నవారికి మార్చి 5న బయలుదేరే రైలులో మొదటి ప్రాధాన్యత ఇస్తాం. టికెట్లు బ్లాక్‌లో అమ్ముతున్నామనే ఆరోపణలు నిరాధారం.

– కె.వి.రంగాకిరణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మా డేటే సెపరేటు!



- మధుర జ్ఞాపకంగా ఫిబ్రవరి 29
- నాలుగేళ్లకోసారి వచ్చే ప్రత్యేక రోజు

లీప్ ఇయర్.. ఫిబ్రవరిలో 29రోజులు వచ్చే సంవత్సరమిది. ఈరోజు పుట్టిన వారు, పెళ్లి చేసుకున్న జంటలు నాలుగేళ్లకోసారి వేడుక జరుపుకోవాల్సిందే. సహచరులు పుట్టిన రోజు, పెళ్లిరోజు ఏటా జరుపుకుంటున్నా వీరు ఎదురుచూడాల్సి వస్తుంది. అయినా ప్రత్యేకంగానే భావిస్తారు. ఈ నేపథ్యాన గురువారం లీప్ ఇయర్ సందర్భంగా వేడుకలు జరుపుకోనున్న పలువురితో పాటు ముహూర్తబలం కుదరడంతో పెళ్లి చేసుకోనున్న కొన్ని జంటలపై ప్రత్యేక కథనాలు... - 8లో...

కాంగ్రెస్ సన్నాహకం!

- పార్లమెంట్ ఎన్నికలకు కసరత్తు
- నేటి నుంచి అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమావేశాలు
- మొదట రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భేటీలు
- హాజరుకానున్న పార్టీ ఇన్‌చార్జి, మంత్రి పొంగులేటి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. త్వరలో షెడ్యూల్ విడుదలవుతుందన్న ప్రచారంతో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలకు పార్టీ పదును పెడుతోంది. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఈ రెండు స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజవర్గాల్లో దశల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం అశ్వారావుపేట, ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో సమావేశం కానున్నారు.

సమన్వయం చేసే దిశగా..

ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి నేతలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లడంపై దృష్టి సారించారు. ఈ రెండు లోక్‌సభ నియోజవకర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. నేతలతో సమావేశమవుతూ స్థానిక పరిస్థితులపై చర్చించనున్నారు. అలాగే, పార్టీ గెలుపోటములపై ప్రభావం చూపించే అంశాలను సమీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేస్తారు. నేతలందరినీ సమన్వయం చేయడమే కాక ఎన్నికలకు సిద్ధం చేసేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

నేడు రెండు చోట్ల..

రెండు పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురువారం సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఖమ్మం లోక్‌సభ పరిధి అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ నేతల సమావేశం దమ్మపేటలో జరగనుంది. ఆ తర్వాత మహబూబాబాద్ పార్లమెంటరీ పరిధి ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఇల్లెందులోని జేకే గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటలకు మొదలవుతుంది. ఈ రెండు సమావేశాల్లోనూ పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలను మంత్రి పొంగులేటి నేతలకు వివరిస్తారు.

గెలుపు ఇచ్చిన ఉత్సాహంతో..

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కొద్ది నెలలకే పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది స్థానాలకు గాను మిత్రపక్షమైన సీపీఐతో కలిసి తొమ్మిది చోట్ల విజయం సాధించింది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ పది నియోజకవర్గాలు కలిసి ఉన్న ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే ఉత్సాహంతో పార్టీ వ్యూహరచన చేస్తోంది. ఈక్రమంలోనే పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఈమేరకు ఖమ్మం, మహబూబాబాద్ స్థానాలకు మంత్రి పొంగులేటిని ఇన్‌చార్జిగా నియమించారు.

‘హస్తం’ గూటికి జెడ్పీ చైర్మన్?

నేడు మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిక!



కంచర్ల చంద్ర శేఖర్‌రావు

చుంచుపల్లి: జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న ఆయన ప్రధాన అనుచరులతో కలిసి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారని తెలిసింది. 2019 మేలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చుంచుపల్లి జెడ్పీటీసీగా బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన కంచర్ల.. జెడ్పీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత చైర్మన్‌గా ఉన్న కోరం కనకయ్య ఇటీవల ఎమ్మెల్యేగా గెలుపొందడంతో జెడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న కంచర్ల చంద్రశేఖర్ రావు జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే ఆయనకు ఇప్పటివరకు ప్రభుత్వ వాహనం, గన్‌మెన్లను అధికారికంగా కేటాయించలేదు. కాగా, ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా అందులో ఒకరైన మంత్రి పొంగులేటికి కంచర్ల అత్యంత సన్నిహితుడుగా ఉండేవారు. వివాదరహితుడిగా పేరున్న ఆయనను కాంగ్రెస్ నేతలు పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిసింది. కాగా, బుధవారమే ఆయనకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వాహనాన్ని కేటాయించారు. ఒకటి, రెండు రోజుల్లో గన్‌మెన్లను కూడా ఇచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి



ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో డీఈఓ

అన్నపురెడ్డిపల్లి : విద్యార్థులు నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచించి భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ వెంకటేశ్వరాచారి పిలుపునిచ్చారు. మండలంలోని ఎర్రగుంట జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సైన్స్‌ ఫేర్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 100 పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు నాలుగు అంశాలపై ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వాటిని డీఈఓ పరిశీలించగా, ఎగ్జిబిట్ల గురించి విద్యార్థులు వివరించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచే ఇలాంటి అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. న్యాయనిర్ణేతలు ఎగ్జిబిట్లను తిలకించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేశారు. అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని, నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. సైన్స్‌ఫేర్‌లో భాగస్వామ్యమైన తొలిఅడుగు ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, ఎంఈఓ సత్యనారాయణ, ఎంపీఓ షబ్నా, పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ , తొలిఅడుగు ఫౌండేషన్ బాధ్యులు రాము, సుభాని తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి
సూపర్‌బజార్(కొత్తగూడెం): భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. భూసేకరణ పనులపై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ సమస్యను రైతులతో చర్చించి పరిష్కరించాలన్నారు. భూ నిర్వాసితులకు రూ.75 కోట్ల నష్టపరిహారం సాధ్యమైనంత త్వరగా చెల్లించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు పెండింగ్‌లో ఉన్న దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో భూసేకరణ పనులు వేగవంతం చేయాలని, వారంలోగా భద్రాచలం ఆర్డీఓకు నివేదిక అందించాలని తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, ఇరిగేషన్ ఈఈ అర్జున్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, ఎస్‌డీసీ సుమ, విద్యుత్ ఎస్‌ఈ రమేష్ పాల్గొన్నారు.

వైద్యుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో గైనకాలజీ, అనస్తీషియా, రేడియాలజీ, పిల్లల వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్ తదితర పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 7వ తేదీ వరకు కలెక్టరేట్ లేదా జిల్లా ఆస్పత్రుల ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. స్పెషలిస్టులకు నెలకు రూ.లక్ష, ఎంబీబీఎస్ వైద్యులకు రూ.52,351వేతనం చెల్లిస్తామని పేర్కొన్నారు.

సాగు వివరాలు నమోదు చేయాలి



చర్ల: మాట్లాడుతున్న బాబూరావు

చర్ల/దుమ్ముగూడెం : రబీలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు ఆదేశించారు. బుధవారం ఆయన చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో పర్యటించారు. చర్ల రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కోసం రైతులతో ఆన్‌లైన్ చేయించాలన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన రైతుల నుంచి కూడా ఈ పథకానికి దరఖాస్తు చేయించాలని సూచించారు. దుమ్ముగూడెంలో మాట్లాడుతూ.. ప్రతీ రైతు కేవైసీ, ఎన్‌పీసీఐ చేయించుకోవాలని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఏడీఏ సుధాకర్ రావు, వ్యవసాయశాఖ అధికారులు శివరాంప్రసాద్, నవీన్, అనీల్‌కుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు చేయూత

బూర్గంపాడు: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు చేయూతనందిస్తామని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ ప్రణవ్‌శర్మ అన్నారు. సారపాక ప్రభుత్వ పాఠశాలలో ఐటీసీ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వసతుల కల్పనకు సహకారం అందిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఎక్స్‌లెమ్, హబెర్ కెమికల్ సంస్థలు సాంకేతిక సహకారం అందించాయని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడు జయంత్‌మార్ దాస్, కార్యదర్శి కేపీఎస్ గోవిందరావు, భాస్కర్‌రావు, చెంగలరావు, రాంబాబు, యాగీ చంద్రశేఖర్, ప్రఫుల్, పాకాల దుర్గాప్రసాద్, రంజిత్, సాయిరామ్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిమిషం నిబంధన అమలుతో వెనుదిరిగిన విద్యార్థి

- ప్రశాంతంగా ప్రథమ సంవత్సర పరీక్ష
- 10,771 మందికి 9,833 మంది విద్యార్థుల హాజరు
- నేడు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు..

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించినా కొందరు 9 గంటల తర్వాత పరీక్ష కేంద్రానికి రావడంతో పరీక్ష రాసే అర్హత కోల్పోయారు. కొత్తగూడెం సింగరేణి పాఠశాల కేంద్రంలో ఇద్దరు, సింగరేణి ఉమెన్స్ కళాశాలలో ఒకరు, నలంద, కృష్ణవేణి కళాశాలల్లో ఇద్దరు, ఇల్లెందులో ఒక విద్యార్థి నిమిషం నిబంధనతో పరీక్ష రాయకుండా వెనుదిరిగారు. జిల్లాలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 10,771 మందికి గాను 9,833 మంది పరీక్షకు హాజరు కాగా, 938 మంది గైర్హాజరయ్యారు.

ఉమెన్స్ కాలేజీలో కలెక్టర్ తనిఖీ..

కొత్తగూడెం సింగరేణి ఉమెన్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ప్రియాంక అల తనిఖీ చేశారు. సీసీ కెమెరాలను, విద్యార్థులకు ఏర్పాటుచేసిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని గదుల్లో గాలి, వెలుతురు వచ్చేలా చూడాలని, వారికి ఏమాత్రం ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కలెక్టర్ వెంట డీఐఈఓ సులోచనరాణి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి ఉన్నారు. ఇక రామవరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల కేంద్రాన్ని ఎస్పీ రోహిత్‌రాజ్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు.




సింగరేణి ఉమెన్స్ కళాశాల కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల

మా డేటే సెపరేటు !

నాలుగేళ్లకోసారి వచ్చే ప్రత్యేక తేదీ

- లీప్ ఇయర్‌లో పుట్టినరోజు, పెళ్లి వేడుకలు ప్రత్యేకం
- వేడుకలకు సిద్ధమవుతున్న పలువురు..

ఖగోళ సంవత్సరంతో.. క్యాలెండర్‌లో వచ్చే తేడాను సరి చేయడానికి లీప్ సంవత్సరం అమల్లోకి వచ్చింది. భూమి సూర్యుడి చుట్టూ తిరగడానికి 365 రోజులకు తోడు మరో ఆరు గంటలు అదనంగా సమయం పడుతుంది. ఇలా ఆరు గంటల చొప్పున నాలుగేళ్లకు ఒక రోజు అవుతుంది. దీంతో ఈ రోజును కలిపి నాలుగేళ్లకోసారి ఫిబ్రవరిలో 29వ తేదీని ప్రవేశపెట్టినలీప్ సంవత్సరానికి పిలుచుకుంటున్నాం. ఈ రోజును పలువురు ప్రత్యేకంగా భావిస్తున్నారు. ఇదేరోజు పుట్టిన వారు పుట్టిన రోజును, పెళ్లి చేసుకున్న వారు వార్షికోత్సవాన్ని నాలుగేళ్లకోసారి జరుపుకోవాల్సి ఉంటుంది. అందుకే ప్రత్యేకంగా భావిస్తూ నేడు(గురువారం) వేడుక వినూత్నంగా, ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి 29న మంచి ముహూర్తం ఉండడంతో పలువురు తమ జీవితంలో జ్ఞాపకంగా భద్రపర్చుకోవాలనే భావనతో పెళ్లి చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నాయి. ఈమేరకు లీప్ సంవత్సరంలో పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న వారి వివరాలతో కథనం... – సాక్షి నెట్‌వర్క్



నాకు నాలుగో పుట్టినరోజు



మా అమ్మానాన్నలు సుల్తానా, నాగుల్‌పాషాకు 2008 ఫిబ్రవరి 29న జన్మించా. మొదటగా 2012లో, ఆ తర్వాత 2016, 2020లో పుట్టిన రోజు జరుపుకున్నా. నాకు ఇప్పుడు 16 సంవత్సరాలు అయినా నాలుగో పుట్టిన రోజు జరుపుకోనున్నా. ఈ ఏడాది మా అక్క ముంతాజ్ చదువుతున్న కొత్తగూడెంలో పుట్టిన రోజు వేడుకలకు జరుపుకోవాలని అనుకుంటున్నా.

– ఎస్.కే.సోహెల్, రాజీవ్‌నగర్‌తండా, ఇల్లెందు మండలం

ప్రత్యేకంగా జరుపుకుంటా..



రహీమున్నీసా, హనీఫ్‌ఖాన్ మా అమ్మానాన్నలు. నేను 1988 ఫిబ్రవరి 29న జన్మించాను. చిన్నతనంలో మొదటి జన్మదినాన్ని నాన్న ఇంటి వద్దే నిర్వహించారు. ప్రస్తుతం నేను సింగరేణిలో పనిచేస్తున్నా. మిగతా వారిలా కాకుండా నాలుగేళ్లకోమారు పుట్టిన రోజు వస్తుందనే బాధ ఏనాడూ కలుగలేదు. ఈ ఏడాది మిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకుంటాను.

– ఎం.డీ.బాబా, 21 పిట్ ఏరియా, ఇల్లెందు మండలం

ఇరవై ఏళ్లలో ఐదు సార్లే..



మాకు 2024 ఫిబ్రవరి 29న వివాహమైంది. వివాహం జరిగి ఈ ఏడాదితో ఇరవై ఏళ్లు పూర్తయినా ఐదు సార్లే పెళ్లి రోజు జరుపుకున్నాం. లీప్ సంవత్సరం కాకుండా మిగతా ఏడాది మార్చి 1న జరుపుకుంటాం. ఏదేమైనా నాలుగేళ్లకు ఒకేసారి వచ్చే లీప్ ఇయర్‌లో జరిగే పెళ్లి రోజు మాకెంతో ప్రత్యేకం. అందుకే ఫిబ్రవరి 29న తిరుమల వెళ్లడం ఆనవాయితీగా మార్చుకున్నాం.

– శీమకుర్తి విజయ్ – కల్యాణి, అశ్వారావుపేట

పెళ్లి రోజు కోసం ఎదురుచూస్తాం..



నాలుగేళ్లకోసారి వచ్చే పెళ్లిరోజు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తాం. మాకు 2012 ఫిబ్రవరి 2న వివాహం జరిగింది. పెళ్లయి 12 ఏళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు రెండుసార్లు మాత్రమే పెళ్లి రోజు జరుపుకున్నాం. ఏటా వచ్చే పెళ్లి రోజును కొందరు మామూలుగానే చూస్తారు. కానీ మాకు నాలుగేళ్లసారి వస్తుండడంతో ప్రత్యేకంగా భావిస్తాం.

– సురేష్ – ఆశ, బూర్గంపాడు

రెండో పుట్టినరోజు వేడుకలు



మా అమ్మానాన్న చందా హరికృష్ణ – సంధ్యారాణి. నేను 2016 ఫిబ్రవరి 29న జన్మించా. ఈరోజు రెండో పుట్టినరోజు వేడుకలు జరుపుకోనున్నా. ఈసందర్భంగా ఆలయంలో పూజలు చేశాక స్నేహితుల సమక్షాన కేక్ కట్ చేస్తా. అంతే కాక మా అమ్మానాన్న సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. వారితో కలిసి ఆ కార్యక్రమాల్లో పాల్గొంటా.

– చందా తేశ్విక సాయిశ్రీ, కొర్నవల్లి, కరకగూడెం

ఐదో పుట్టినరోజు...



మా అమ్మానాన్న పోగుల రామారావు – రమాదేవికి 2004 ఫిబ్రవరి 29న జన్మించా. నేడు ఐదో పుట్టినరోజు వేడుకలు జరుపుకోనున్నాను. హైదరాబాద్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతుండడంతో ఈసారి అక్కడే వేడుకలు జరుపుకుంటా. స్నేహితుల నడుమ పుట్టిన రోజు జరుపుకోవడమే కాక సేవా కార్యక్రమాలు కూడా చేపట్టాలని అనుకుంటున్నా.

– పోగుల శివప్రసాద్, కరకగూడెం

నాలుగేళ్లకోసారి..



మా అమ్మ బాదావత్ శారద – రాము మాజీ సర్పంచ్. నేను సుజాతనగర్ మండలం సర్వారంలో 1992 ఫిబ్రవరి 29 తేదీన జన్మించా. అందరిలా కాకుండా నాలుగేళ్లకు ఒకసారి నా పుట్టిన రోజు వస్తుండడంతో కుటుంబ సభ్యులు, స్నేహితుల నడుమ ఘనంగా నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా పుట్టినరోజు ఎప్పటికీ జ్ఞాపకం ఉండిపోయేలా అనాథలకు అన్నదానం నిర్వహిస్తారు.



తెల్లం శ్రేయన్ శ్రావ్



కమటం ఉమేష్

- అశ్వాపురం మండలం చింతిర్యాలగూడెంకు చెందిన తెల్లం పవన్‌కుమార్, కృష్ణవేణి దంపతులకు కుమారుడు శ్రేయన్ శ్రావ్ 2020 ఫిబ్రవరి 29న జన్మించాడు. గురువారం ఆయన మొదటి రోజు జరగనుండడంతో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే, మల్లెలమడుగుకు చెందిన కమటం సురేష్, సరిత దంపతుల కుమారుడు ఉమేష్ 2012 ఫిబ్రవరి 29న జన్మించాడు. ఇప్పటివరకు ఆయన మూడు పుట్టిన రోజులు జరుపుకోగా గురువారం నాలుగోది జరగనుంది.



నయన దీక్షిత శ్రీ



సహక్షిత



ప్రవీణ్‌నాయక్



తేజస్విని



సాత్విక



ఈసాల రిషిత

- టేకులపల్లి మండలం మొక్కంపాడుగుంపుకి చెందిన కుంజా నరేష్–శ్రీదేవి దంపతుల కుమార్తె నయన దీక్షితశ్రీ, రామచంద్రునిపేటకు చెందిన వాసం శంకర్–విజయ దంపతుల కుమార్తె సహక్షిత, తడికలపూడి రోడ్డు ఏరియాకు చెందిన గరిక సత్తేశ్వర్‌రావు–లావణ్య కుమార్తె గరిక తేజస్విని, సులానగర్‌కు చింతమల్ల వీరస్వామి–జ్యోతి దంపతుల కుమార్తె సాత్విక, కోటల్లకు చెందిన ఈసాల ప్రసాద్–రాణి దంపతుల కుమార్తె రిషిత 2016 ఫిబ్రవరి 29న జన్మించారు. వీరికి ఇప్పుడు ఎనిమిదేళ్లు నిండగా... గురువారం రెండో పుట్టిన రోజు వేడుక జరుపుకోనున్నారు. ఇక మండలంలోని గోలియాతండాకు చెందిన భూక్యా లాలు–లక్ష్మి దంపతుల కుమారుడు ప్రవీణ్‌నాయక్ 2004 ఫిబ్రవరి 29న జన్మించాడు. ప్రస్తుతం ఆయన ఐదో పుట్టిన రోజు వేడుక జరుపుకోనున్నాడు.

రోజంతా శుభాకాంక్షల వెల్లువ



నాలుగేళ్లకోసారి జరుపుకునే పుట్టిన రోజు ప్రత్యేకం. అమ్మానాన్న గతంలో వేడుకగా జరిపేవారు. చిన్నప్పటి స్నేహితులు మొదలు ఇప్పటివరకు పరిచయమైన ప్రతీ ఒక్కరు గుర్తు పెట్టుకుంటారు. పుట్టినరోజున అందరూ శుభాకాంక్షలు చెబుతుండడం ఆనందంగా ఉంటుంది. సింగరేణిలోని నా సహచర ఉద్యోగులు కూడా వేడుక జరిపిస్తారు.

– నాయుడు సతీష్‌కుమార్, మణుగూరు

నాలుగేళ్లకో సారి ఆనందం..



నేను 1980 ఫిబ్రవరి 29న జన్మించా. అందరికీ ప్రతీ సంవత్సరం పుట్టిన రోజు ఉంటే నాకు మాత్రం నాలుగేళ్లకోసారి వస్తుంది. అందుకే నన్ను మా కుటుంబంలో ప్రత్యేకంగా చూస్తారు. ఇది నాకు కూడా సంతోషంగా ఉంటుంది. నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు జరుపుకోవడాన్ని ప్రత్యేకంగా భావిస్తా. కుటుంబీకుల నడుమ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశాం.

– దాచేపల్లి సుభాషిణి, ఉపాధ్యాయురాలు, పాల్వంచ

సేవా కార్యక్రమాలు చేస్తా..



1964 ఫిబ్రవరి 29న నల్లగొండ జిల్లాలో జన్మించిన నేను వ్యాపారరీత్యా పాల్వంచలో స్థిరపడ్డాను. నా పుట్టినరోజు నాలుగు సంవత్సరాలకోసారి రావడం ఆనందంగానే కాకుండా ప్రత్యేకంగా అనిపిస్తుంది. కుటుంబంతో కలిసి వేడుకలు జరుపుకోవడమే కాక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తా. పేదలకు నా వంతు సాయం చేస్తాను.

– జూలూరి మల్లేశ్వరరావు, పాల్వంచ

మరిచిపోలేని మధురానుభూతి..



లీప్ సంవత్సరంలో జన్మించడం మధురానుభూతిని కలిగిస్తుంది. నేను 1996 ఫిబ్రవరి 29న జన్మించా. నాలుగేళ్లకోసారి మాత్రమే పుట్టినరోజు వస్తున్నా ప్రత్యేకంగా భావిస్తా. మా గ్రామస్తులే కాక బంధువులు, స్నేహితులు కూడా నా పుట్టినరోజు గుర్తు పెట్టుకుని మరీ శుభాకాంక్షలు చెబుతారు. ఇవే నాలుగేళ్ల పాటు నన్ను నడిపిస్తాయి.

– బొల్లికొండ ప్రభుకుమార్, పట్వారిగూడెం, దమ్మపేట మండలం

ముహూర్తబలం!

నాలుగేళ్లకోసారి వచ్చే రోజే కాదు మంచి ముహూర్తం కూడా ఉంది! ఇంకేముంది పలువురు ఈరోజు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గురువారం లీప్ ఇయర్ కావడంతో పాటు వివాహానికి బలమైన ముహూర్తం ఉందని పండితులు చెబుతున్నారు. దీంతో ఇదేరోజు ఒక్కటయ్యేందుకు పెద్దసంఖ్యలో జంటలు ఏర్పాట్లు చేసుకున్నాయి. కాగా, ఈరోజు పెళ్లి చేసుకునే వారు మళ్లీ నాలుగేళ్ల తర్వాత అంటే 2028లోనే మొదటి వివాహ వార్షికోత్సవం జరుపుకోవాల్సి ఉంటుంది. ఈ రోజు పెళ్లి రోజు జరుపుకోనున్న కొందరి వివరాలిలా ఉన్నాయి. గుండాల మండలంలోని సాయనపల్లికి చెందిన నర్సింహారావు వివాహం చంద్రుగొండకు చెందిన సౌజన్యతో జరగనుంది. అలాగే, టేకులపల్లి మండలం తడికలపూడి జీపీ పరిధి కోక్యా తండాకు చెందిన అజ్మీరా నరేష్ వివాహం సింగరేణి మండలం గాదెపాడుకు చెందిన లక్ష్మీకావేరితో, పాతతడికలపూడికి చెందిన తెల్లం వెంకటేశ్వర్లు వివాహం, సుజాతనగర్ మండటం అంజనాపురానికి చెందిన లక్ష్మీసంగీతతో, మణుగూరుకు చెందిన జెట్టి దినేష్ వివాహం హైదరాబాద్‌కు చెందిన సుప్రియతో, పాల్వంచకు చెందిన లహరి వివాహం వేణుసాయితో, కొత్తగూడెం మండలం రామవరానికి చెందిన సింగిరాల వినయ్ వివాహం పాల్వంచకు చెందిన పగిళ్ల గాయత్రితో, కొత్తగూడెంకు చెందిన పిండి సుమంత్ వివాహం మహారాష్ట్రలోని సిరొంచలోని అక్షితతో, చర్లకు చెందిన శ్రీకాంత్ వివాహం విశాఖపట్నానికి చెందిన హరితతో, సుజాతనగర్ మండలం సర్వారానికి చెందిన ఇస్లావత్ విజయ్‌కుమార్ వివాహం హైమావతితో, భద్రాచలం సుభాష్‌నగర్ కాలనీకి చెందిన సందీప్ వివాహం అపూర్వతో గురువారం జరగనుంది.

క్లుప్తంగా

మణుగూరు కోర్టును సందర్శించిన జడ్జి

మణుగూరురూరల్: మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు జడ్జి శ్యామశ్రీ బుధవారం సందర్శించారు. మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు, న్యాయవాదులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కోర్టు ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం రికార్డులను పరిశీలించి మాట్లాడారు. జడ్జిని మణుగూరు సీఐ సతీశ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీపీ దుర్గాభాయ్, మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, న్యాయవాదులు కూర్మా విజయ్‌రావు, చిర్ర రవికుమార్, సర్వేశ్వరరావు, పోశం భాస్కర్, శైలజ, కవిత, సావిత్రి, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సీఐలు బదిలీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ బుధవారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగూడెం త్రీటౌన్ సీఐ మురళిని ఖమ్మం సీఎస్‌బీ–1కు, ఏడూళ్లబయ్యారం సీఐ కె.శివప్రసాద్‌ను కొత్తగూడెం త్రీటౌన్‌కు బదిలీ చేశారు. చుంచుపల్లి సీఐ పెద్దన్నకుమార్‌ను మల్టీజోన్‌కు బదిలీ చేయగా భద్రాచలం సీఐ రాయల వెంకటేశ్వర్లును చుంచుపల్లికి బదిలీ చేశారు. అశ్వాపురం సీఐ కరుణాకర్‌ను ఏడూళ్లబయ్యారానికి, ఖమ్మం సీఎస్‌బీ సీఐ జితేందర్‌ను అశ్వాపురానికి బదిలీ చేశారు.

ఉచిత శిక్షణ తరగతులు

చంద్రుగొండ: ఐటీసీ, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.వెంకట్రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: బాల్య వివాహం ఘటనలో బుధవారం పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16)కు వివాహం చేసేందుకు యత్నించిన తల్లిదండ్రులతోపాటు వరుడు, అతడి తల్లిదండ్రులపై సీడీపీఓ రోజారాణి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య


సుజాతనగర్: కుటుంబ కలహాల కారణంగా ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సుజాతనగర్ ఠాణాలో బుధవారం కేసు నమోదైంది. మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన నాళం ధన్‌రాజ్ (20) భార్య కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. క్షణికావేశానికి లోనైన ఆయన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జుబేదాబేగం తెలిపారు.

రూ.కోట్లలో సాగిన నగదు లావాదేవీలు

- బ్యాంకుల నుంచి స్టేట్‌మెంట్ స్వీకరించిన బాధితులు
- నేడు పోలీసులను ఫిర్యాదు చేయాలని నిర్ణయం

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్, సంజయ్‌నగర్ గ్రామాలకు చెందిన మహిళలకు రుణం మంజూరు పేరుతో ఎదురైన మోసం చిలికిచిలికి గాలివానలా మారుతోంది. తమకు తెలియకుండానే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కరెంటు అకౌంట్లు ప్రారంభించిన ఖమ్మానికి చెందిన వ్యక్తులు చేసిన ఘరానా మోసం వెలుగు చూడటంతో బాధిత మహిళలు సల్మా, నజియా, అఫ్రిన్, సౌజన్య, సంధ్య వారంరోజులుగా బ్యాంకులు, పోలీసుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తాము కేసు ఎలా నమోదు చేసుకుంటామని ఒకమారు.. ఘటన జరిగిన ప్రాంతం తమ పరిధిలోనిది కాదంటూ మరోమారు పోలీసులు బదులివ్వడం, బ్యాంకు ఖాతాల వివరాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు నిరాకరించడంతో బాధితులు ఆందోళనకు సన్నద్ధమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన బ్యాంకర్లు బుధవారం బాధిత మహిళలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వారి పేరిట ఉన్న లావాదేవీల వివరాలను స్టేట్‌మెంట్ రూపంలో జనవరి నెల వరకు అందజేశారు. లావాదేవీలను పరిశీలించిన వారు నిర్ఘాంతపోయారు. సల్మా, నజియా, అఫ్రిన్ పేరిట జనవరిలోనే రూ.2.10 కోట్ల లావాదేవీలు, సౌజన్య పేరిట రూ.55 లక్షలు, సంధ్య పేరిట రూ.60 లక్షలు లావాదేవీలు జరిగినట్లుగా నిర్ధారణ అయ్యింది. ఇదిలా ఉండగా విషయం వెలుగు చూసిన సమయంలో బ్యాంకు అధికారులు చెప్పిన వివరాల ప్రకారం కల్లూరి సౌజన్య ఖాతాలో రూ.13 లక్షలు, ఎస్‌కే సల్మా ఖాతాలో రూ.12 లక్షలు, ఎస్‌కే నజియా ఖాతాలో రూ.3 లక్షలు, అఫ్రిన్ ఖాతాలో రూ.3.5 లక్షలు, ఆదిమూల సంధ్య ఖాతాలో రూ.6 లక్షలు నిల్వ ఉన్నాయి. కానీ, తాజాగా బ్యాంకు స్టేట్‌మెంట్‌లో మాత్రం ఒక్క సౌజన్య ఖాతాలో రూ.19 వేలు, సంధ్య ఖాతాలో రూ.9 వేలు మాత్రమే నిల్వ ఉన్నట్లు నమోదై ఉంది. ఖాతాదారులకు తెలియకుండానే ఖాతాలు ప్రారంభించడం, వారిపేరిట ఇంత పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరగడం చూస్తుంటే పెద్ద మొత్తంలో హవాలా డబ్బు చేతులు మారినట్లుగా తెలుస్తోందని పలువురు అనుమానిస్తున్నారు. ఖాతాలు ఫ్రీజ్ చేసిన తరువాత కూడా బ్యాంకు నుంచి లావాదేవీలు ఎలా జరిగాయో అంతుచిక్కని మిస్టరీగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా బ్యాంకు స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు ఇప్పటికైనా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభిస్తారో.. పరిధి సాకుతో దాటవేత వైఖరి అవలంబిస్తారో వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా గురువారం ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత మహిళలు తెలిపారు.

స్వచ్ఛంద సంస్థ సహకారం అభినందనీయం



అదనపు తరగతి గదిని ప్రారంభిస్తున్న డీడీ మణెమ్మ తదితరులు

బూర్గంపాడు: హైదరాబాద్‌కు చెందిన సమారిటర్స్ ఫర్ ది నేషన్ స్వచ్ఛంద సంస్థ రూ.2.10 లక్షల వ్యయంతో బూర్గంపాడులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో అదనపు తరగతి గదిని నిర్మించడం అభినందనీయమని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ అన్నారు. ఈ సంస్థ నిర్మించిన అదనపు తరగతి గదిని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు సమారిటర్స్ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావటం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో రామ్‌కుమార్, డాక్టర్ కపిల్, దేవాసింగ్, నాగులు, రమేశ్, బాలు, బాబూరావు, రూప్లా, హరిలాల్, సీతారాం, మురళి పాల్గొన్నారు.

ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి

దమ్మపేట: ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడాలని, భద్రాచలం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని పార్కలగండి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా డీడీ హాజరై మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించి, సరైన ప్రణాళికతో పబ్లిక్ పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటీడీఏ జిల్లా క్రీడల అధికారి గోపాల్‌రావు, ప్రిన్సిపాల్ ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

మూడు వోల్వోలకు ప్రమాదం..

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీలో ఓబీ పనులు నిర్వహిస్తున్న మహాలక్ష్మి కంపెనీలో మంగళవారం రాత్రి షిఫ్ట్‌లో రెండు వోల్వోలు వేర్వేరు ప్రదేశాల్లో ప్రమాదాలకు గురికాగా, బుధవారం రాత్రి మరో వాల్వో ప్రమాదానికి గురైనట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. రాత్రి 12 గంటల సమయంలో టాప్ నుంచి అన్‌లోడ్ చేసేందుకు వెళ్లిన 460 (హార్స్ పవర్) వోల్వో డంపింగ్ యార్డ్ వద్ద బోల్తాపడగా, టాప్ నుంచి వెళ్తున్న 500 (హార్స్ పవర్) వోల్వో ఆపరేటర్ నిద్రలో సైడ్ బర్మ్(డివైడర్)ను ఎక్కించినట్లు సమాచారం. కాగా రెండు వాహనాలను నడుపుతున్న ఆపరేటర్లకు త్రుటిలో పెనుప్రమాదం తప్పగా, ఓ ఆపరేటర్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి మూడో షిఫ్ట్ ప్రారంభంలో మరో వోల్వో పడిపోగా కార్మికుడికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. క్షతగాత్రుడిని ఎవరికీ చెప్పకుండా వైద్యశాలకు తరలించినట్లు సమాచారం. ఈ విషయమై మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసాచారిని వివరణ కోరగా, అలాంటిదేమీ లేదన్నారు.

మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడి పూత, పిందెలను పరిశీలిస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): మామిడి పూత, పిందె రాలకుండా మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో మామిడి తోటలను పరిశీలించి, రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. పూత, పిందె రాలకుండా సకాలంలో నీరు పెట్టాలని, వేప నూనెతో పాటు సిఫార్సు చేసిన క్రిమి సంహారక మందులు వాడాలన్నారు. పిందె నాణ్యంగా రావడానికి 13:0:45 లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పండు ఈగ నివారణకు కాయ నాణ్యత, నిగారింపునకు పిందెలు గచ్చకాయ లేదా నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ బ్యాగింగ్ లాంటి ఉత్తమ పద్ధతులు పాటించాలని రైతులకు వివరించారు.

కేవీకే శాస్త్రవేత్తల పర్యటన

ములకలపల్లి: మండలంలోని తాళ్లపాయ గ్రామ శివారులోని వరి పంటలను కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు పరిశీలించారు. గ్రామానికి చెందిన పలువురు రైతుల ఫిర్యాదు మేరకు బుధవారం వారు పర్యటించి వివరాలు సేకరించారు. కేవీకే కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, సహాయ వ్యవసాయ సంచాలకులు రవి, లాల్‌చందర్, ఏఓ కరుణామయి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఓ మహిళ అవమానభారంతో పురుగులమందు తాగింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ తిరుపతిరావు కథనం మేరకు.. మంగళవారం అనంతారం గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంటికి అదే గ్రామానికి చెందిన ఈసం సుజాత, తన బంధువులు నిరోషా, సునీత వచ్చారు. తన భర్తతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో నిరోషా, సునీత, సుజాత మహిళపై దాడికి పాల్పడటంతోపాటు దుర్భాషలాడారు. దీంతో మహిళ మిర్చి తోటకు వెళ్లి పురుగులమందు తాగింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహిళ భర్త నర్సింహారావు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తిరుపతిరావు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేసి పలువురిని అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్‌ఐ శ్రీను కథనం మేరకు.. మండలంలోని రామన్నగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,400 నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లు, 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కేసు నమోదు

దుమ్ముగూడెం: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి సుమారు రూ.30 వేలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బొడ్డు అశోక్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. చిన్నబండిరేవు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకోగా కొందరు పారిపోయారు. వారి వద్ద నుంచి రూ.32,030 నగదు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

జూదరులు అరెస్ట్

మణుగూరుటౌన్: మండలంలోని మారుమూల ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్న కొందరు వ్యక్తులను పోలీసులు బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రైల్వేస్టేషన్ వద్ద జామాయిల్ చెట్ల మధ్య కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు సీఐ సతీశ్‌కుమార్, ఎస్‌ఐ రాజేశ్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



క్లుప్తంగా...


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సీనియర్ నేత సూర్యారావు

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నేత గొల్లపల్లి

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పి.గన్నవరం టీడీపీ నేత నేలపూడి స్టాలిన్ బాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి సీఎం వైఎస్ జగన్ పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్‌రెడ్డి, ఎంపీ కేశినేని నాని పాల్గొన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లనుద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ పెత్తందార్లకు అనుకూలంగా, దళిత వర్గాలకు, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉందని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ టీడీపీ నేతలు, కార్యకర్తల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఒంగోలు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా చెవిరెడ్డి

- మరో ఐదుగురు పార్టీ సమన్వయకర్తల నియామకం
- గుంటూరు లోక్‌సభకు కిలారి రోశయ్య



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో రెండు పార్లమెంటు స్థానాలకు, మూడు శాసన సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పార్టీ సమన్వయకర్తల ఎనిమిదో జాబితాలో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గానికి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానికి కిలారి రోశయ్యను నియమించారు. పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా అంబటి మురళి, కందుకూరుకు బుర్రా మధుసూదన్ యాదవ్, గంగాధర నెల్లూరు (జీడీ నెల్లూరు)కు కల్లత్తూర్ కృపాలక్ష్మిని నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ పత్రికా విడుదల చేసింది.

మాటకు మించి సాయం

ప్రతి అడుగులో అన్నదాతకు తోడుగా నిలబడ్డాం: సీఎం జగన్

- రూ.50 వేలే ఇస్తామని చెప్పినా ప్రతి ఒక్కరికీ రూ.67,500 ఇచ్చాం
- అన్నదాతలకు ఈ ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చాం
- వైఎస్సార్ రైతు భరోసా మూడో విడతగా 53.58 లక్షల కుటుంబాలకు రూ.1,078.36 కోట్లు
- సున్నా వడ్డీ రాయితీ కింద 10.79 లక్షల మందికి మరో రూ.215.98 కోట్లు
- క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేసిన సీఎం జగన్


వైఎస్సార్ రైతు భరోసా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: అన్నదాతల కష్టం తెలిసిన ప్రభుత్వంగా ఈ ఐదేళ్లలో ప్రతి అడుగూ రైతులు, రైతు కూలీలు బాగుండాలని మనసా వాచా కర్మణా వేస్తూ వచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ప్రగాఢంగా విశ్వసిస్తూ విత్తనం నుంచి పంట విక్రయం వరకూ అన్ని విధాలుగా చేయి పట్టుకుని నడిపించామన్నారు. ప్రతీ పథకాన్ని పేద రైతు కుటుంబాలకు అందుబాటులోకి తెచ్చి సంక్షేమ ఫలాలన్నీ అందించామని, రాష్ట్రంలో ఐదేళ్లుగా మాత్రమే ఇలా జరుగుతోందని గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా చెప్పిన సమయానికి చెప్పినట్లుగా రైతన్నలకు భరోసా కల్పిస్తూ వ్యవసాయాన్ని పండగ చేసిన ప్రభుత్వం ఇదేనని, భవిష్యత్‌లోనూ ఇదే రీతిలో అండగా నిలిచి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా వరుసగా ఐదో ఏడాది మూడో విడత కింద ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున 53.58 లక్షల మందికి రూ.1,078.36 కోట్ల పెట్టుబడి సాయంతో పాటు 10.79 లక్షల మందికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.215.98 కోట్లు కలిపి మొత్తం 64.37 లక్షల మంది ఖాతాలకు రూ.1,294.34 కోట్లను బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

హామీ కంటే మిన్నగా..

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.50 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీ కంటే మిన్నగా రూ.12,500 బదులు ఏటా రూ.13,500 చొప్పున అందచేశాం. రూ.50 వేలకు బదులు ఐదేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.67,500 చొప్పున లబ్ధి చేకూర్చాం. ఇవాళ జమ చేస్తున్న పెట్టుబడి సాయంతో కలిపి ఐదేళ్లలో 53.58 లక్షల రైతు కుటుంబాలకు మొత్తం రూ.34,288 కోట్లు పంటలు వేసే సమయంలో పెట్టుబడి సాయంగా అందించాం. ప్రతి రైతన్నకు పెట్టుబడి సాయంగా డబ్బులు ఇవ్వడమే కాకుండా సున్నా వడ్డీని కూడా వర్తింపజేస్తూ రూ.లక్ష వరకు పంట రుణాలను అందిస్తున్న కార్యక్రమం కూడా మన ప్రభుత్వ హయాంలోనే జరుగుతోంది. గత ప్రభుత్వం 39.07 లక్షల మంది రైతులకు ఎగ్గొట్టిన బకాయిలతో కలిపి 84.67 లక్షల మంది అన్నదాతలకు సున్నా వడ్డీ రాయితీ కింద దాదాపు రూ.2,051 కోట్లు అందించాం.

మాఫీ పేరుతో బాబు మోసాలు..

2014 ఎన్నికల సమయంలో రూ.87,612 కోట్ల రైతుల రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానన్న చంద్రబాబు తీరా గద్దెనెక్కిన తర్వాత ఎంత దారుణంగా మోసగించారో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలని కోరుతున్నా. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు సీఎం కావాలని పబ్లిసిటీ చేసి ఆ తరువాత వంచనకు పాల్పడ్డారు. చివరికి ఆ రూ.87,612 కోట్లపై సున్నావడ్డీని కూడా ఎగ్గొట్టాడు. ఐదేళ్లలో దాదాపు రూ.30 వేల కోట్లు ఆ వడ్డీలకే అవుతుంది. ఆయన ఎగ్గొట్టిన సున్నా వడ్డీ బకాయిలను కూడా మనమే ఇచ్చాం. ఐదేళ్లలో ఒక్క వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ పథకం ద్వారానే రైతుల చేతుల్లో రూ.34,288 వేల కోట్లు పెట్టాం. ధాన్యం కొనుగోలు కోసం మరో రూ.65 కోట్లు వెచ్చించాం. ఇలా వివిధ పథకాల ద్వారా అన్నదాతల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వ్యవసాయ రంగం కోసం ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు చేసిన పరిస్థితి కళ్లెదుటే కనిపిస్తోంది.

బాబు గ్రాఫిక్స్ పెట్టుబడులు.. జగన్ రియల్ పెట్టుబడులు

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల్లో బట్టబయలైన బాబు గ్రాఫిక్స్ మాటల బురిడీ

బాబు హయాంలోకంటే సీఎం జగన్ హయాంలో రాష్ట్రంలో 3 రెట్లు పెరిగిన పెట్టుబడులు



సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలన : ఓ కంప్యూటర్.. అందులో పెద్ద పెద్ద కంపెనీల పేర్లు, లోగోలు.. వాటి గ్రాఫిక్స్.. ఓ వంద అంకెలు, నలభై గీతలు.. వంద అబద్ధాలు. అన్నీ భూతద్దంలో చూపిస్తారు. వినడానికి, గ్రాఫిక్స్ చూడటానికి అబ్బో అనిపిస్తాయి. వాస్తవంగా వచ్చే పెట్టుబడులు సున్నా. పెట్టుబడులన్నీ కాగితాలకు, కంప్యూటర్లకే పరిమితం. సీఎం వైఎస్ జగన్ పాలన : చంద్రబాబు గ్రాఫిక్స్ లాంటి టక్కుటమారాలేమీ ఉండవు. అంతా వాస్తవికత. వచ్చే పెట్టుబడులే కాగితాల్లో కనిపిస్తాయి. అవే ప్రజలకు చేరతాయి. వాస్తవంగా నూరు శాతం పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమలు వస్తాయి. కాగితాల్లో ఉన్న పెట్టుబడులే పరిశ్రమలుగా రూపుదిద్దుకొని ప్రజల ముందు నిలుస్తాయి. .. అందుకే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వస్తున్నాయి. గత చంద్రబాబు ప్రభుత్వంతో పోలిస్తే గడిచిన నాలుగున్నర ఏళ్లలో పెట్టుబడులు మూడు రెట్లు పెరిగాయి. ఈ విషయం వెల్లడించింది స్వయానా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ. ఆ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఫర్ ఇండ్రస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. 2014–18 సంవత్సరాల మధ్య కాలంలో (చంద్రబాబు పాలన) రాష్ట్రంలోకి వాస్తవంగా వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే 2019 నుంచి 2023 జూన్ వరకు (వైఎస్ జగన్ పాలన) వచ్చిన పెట్టుబడులు 226.9 శాతం అధికంగా వచ్చాయి. 2014–18 క్యాలండర్ ఇయర్ ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వాస్తవ రూపంలోకి వచ్చి ఉత్పత్తిని ప్రారంభించిన పరిశ్రమల పెట్టుబడులు కేవలం రూ.32,803 కోట్లు మాత్రమే. ప్రస్తుత వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రూ.1,00,103 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపం దాల్చాయి. చంద్రబాబు నాయుడు పెట్టుబడుల సదస్సు పేరుతో ప్రతి ఏటా హడావుడి చేసి లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేశాయని చెప్పిన వార్తల్లో వాస్తవం ఏమాత్రం లేదని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. చంద్రబాబు హయాంలో వివిధ పెట్టుబడుల సదస్సుల ద్వారా రూ.18.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ఉత్తుత్తి ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న విషయం సుస్పష్టమైంది.

తరలి వస్తున్న దిగ్గజ సంస్థలు

చంద్రబాబుకు భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎటువంటి ప్రచార ఆర్భాటాలు చేయకుండా పరిశ్రమలకు అన్ని విధాలా చేయూతనిస్తున్నారు. సీఎం జగన్ సహకారం అందించడంతో రిలయన్స్, అదానీ, టాటా, బిర్లా, హెచ్‌యూఎల్, బ్లూస్టార్, డైకిన్, ఇన్ఫోసిస్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. సాధారణంగా దేశంలో పెట్టుబడుల సదస్సులోజరిగే ఒప్పందాల్లో 16 నుంచి 17 శాతం మాత్రమే వాస్తవ రూపంలోకి వస్తాయి. కానీ విశాఖ పెట్టుబడుల సదస్సు జరిగి ఏడాది కాకుండానే 19 శాతం పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చేశాయి. జీఐఎస్‌లో మొత్తం రూ.13.11 లక్షల కోట్ల విలువైన 386 ఒప్పందాలు జరగ్గా రూ.2.46 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన పరిశ్రమల పనులు వేర్వేరు దశల్లో ఉన్నాయి.

టీ–జే ఫ్లాప్ షో!

- తుస్సుమన్న టీడీపీ–జనసేన (టీజే) తొలి బహిరంగ సభ
- 6 లక్షల మంది వస్తారని ఊదరగొట్టిన నేతలు
- కిందా మీదా పడి 40–50 వేల మందికే పరిమితం
- పొత్తుకు తమ మద్దతు లేదని స్పష్టం చేసిన ఇరు పార్టీల కేడర్


సభకు అరకొరగా హాజరైన టీడీపీ-జనసేన కార్యకర్తలు, నాయకులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ సాక్షి, భీమవరం: జనాదరణ లేక టీడీపీ–జనసేన (టీజే) తొలి బహిరంగ సభ తుస్సుమంది. అంతా.. ఇంతా.. నభూతో.. అన్నట్లు నాలుగైదు రోజులుగా ఊదరగొట్టిన ఎల్లో మీడియా ఇప్పుడు ఈ సభకు వచ్చిన జనం మాటెత్తడం లేదు. టీడీపీ–జనసేన పొత్తుకు జనం మద్దతును ఈ సభతో చాటిచెబుతామంటూ ఇరు పార్టీల అధినేతలు హడావుడి చేశారు. కేడర్ నిరసనల్ని, మనోభావాల్ని లెక్కచేయకుండా చంద్రబాబు, పవన్‌ల వ్యక్తిగత అ'జెండా'తో నిర్వహించిన సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆరు లక్షల మంది తరలివస్తారంటూ ఎల్లో మీడియాలో మోత మోగించారు. తాడేపల్లిగూడెం సమీపంలో 22 ఎకరాల ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేసుకుంటే.. తీరా టీడీపీ–జనసేన పార్టీల కేడర్ నిరాదరణతో కాస్తా ఫ్లాప్ షోగా మిగిలింది. ఈ పొత్తు తమకు అంగీకారం కాదని స్పష్టం చేస్తూ నాయకులు, కింది స్థాయి కేడర్ సభను తుస్సుమనిపించారు. ప్రజలు పొత్తుకు బ్రహ్మరథం పడతారని చంద్రబాబు, పవన్‌లు ఎన్నో ఆశలు పెట్టుకుంటే.. టీడీపీ–జనసేన సంయుక్తంగా నిర్వహించిన తొలి బహిరంగ జెండా సభకు వారి లక్ష్యంలో పది శాతం మంది కూడా రాకపోవడం ఆ పార్టీల భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. సభకు హాజరైన వారి సంఖ్య చూసి ఆ పార్టీల అగ్ర నేతలు విస్తుపోయారు. గ్యాలరీల్లో సగం పైగా కుర్చీలు ఖాళీగా కనిపించడంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కంగుతిన్నారు.

టీ–జే పార్టీ నేతల్లో నైరాశ్యం

టీడీపీ–జనసేన నిర్వహిస్తున్న తొలి ఉమ్మడి సభకు తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి బైపాస్ పక్కనే ఉన్న 22 ఎకరాల మైదానాన్ని ఎంచుకున్నారు. 500 మంది కూర్చొవడానికి వీలుగా వేదికతోపాటు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వేర్వేరుగా హెలికాప్టర్‌లలో రానుండటంతో అక్కడకు సమీపంలో రెండు హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. వేదిక, హెలి ప్యాడ్‌లు, వీవీఐపీల రెస్ట్ రూమ్‌లు, పార్కింగ్‌కు ఏడు ఎకరాలు పోగా మిగిలిన 15 ఎకరాల్లో కార్యకర్తల కోసం 22 గ్యాలరీలు సిద్ధం చేశారు. ఒక్కో గ్యాలరీలో 1,500 కుర్చీల చొప్పున 22 గ్యాలరీల్లో 33 వేల కుర్చీలు వేశారు. మొత్తం కుర్చీలన్నీ నిండిపోయి 15 ఎకరాల ప్రాంగణం కిక్కిరిసిపోతే దాదాపు 60 వేల మంది హాజరైనట్లు లెక్క. అయితే సభ ప్రారంభం నుంచి చివరిదాకా సగం గ్యాలరీలు ఖాళీగానే ఉన్నాయి. వాస్తవానికి ఆరు లక్షల మంది జనం వస్తారని టీడీపీ–జనసేన నేతలు చెప్పారు. అయితే అది సాధ్యం కాదని వారికీ తెలుసు. అందుకే తక్కువ స్థలం ఉన్న చోట సభ నిర్వహించి, జనం కిక్కిరిసిపోతే.. దానినే కొండంతలు చేసి చూపాలన్న టీడీపీ, జనసేన అగ్రనేతల పన్నాగం బెడిసి కొట్టింది. మొత్తంగా 40–50 వేల మంది కూడా హాజరు కాకపోవడం ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

జిల్లా వార్తలు

మార్చి 5న పండితాపురం సంత వేలం

కామేపల్లి: రాష్ట్రంలోనే పేరున్న కామేపల్లి మండలం కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధిలో శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత నిర్వహణకు మార్చి 5న వేలం నిర్వహించనున్నట్లు జీపీ ప్రత్యేకాధికారి రవీందర్, కార్యదర్శి గుగులోత్ నెహ్రూ తెలిపారు. ఏడాది పాటు అప్పగించేందుకు నిర్వహిస్తున్న వేలంలో పాల్గొనేందుకు పీసా చట్టం ప్రకారం పంచాయతీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలం నిర్వహించే రోజు ఉదయం 11 గంటల్లోపు ధరావతు సొమ్ము రూ.30 లక్షలు, సాల్వేన్సీ కింద రూ.5 లక్షలను డీడీ లేదా నగదు రూపేణా పంచాయతీ కార్యదర్శి పేరున చెల్లించాలని సూచించారు.

పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని విజయం సాధించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆందోళనకు గురికాకుండా పరీక్ష రాయాలని, తద్వారా మెరుగైన ఫలితాలు సాధించొచ్చని తెలిపారు. కాగా, శుక్రవారం నుంచి మొదలయ్యే ప్రీఫైనల్ పరీక్షల విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు గుర్తించి వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో మొత్తం 2,591 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారని పీఓ వెల్లడించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి వితరణ


దాతలకు రశీదు ఇస్తున్న అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీకి చెందిన భక్తులు బుధవారం విరాళం అందచేశారు. విజయవాడలోని ముత్యాలంపాడుకు చెందిన పంచాలవరపు కామేశ్వరశర్మ ఆలయాధికారులకు రూ.1,12,000ను అందజేయగా వారు స్వామి దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, దాతల కుటుంబీకులు పాల్గొన్నారు.

క్షణాల్లో మిర్చి నాణ్యత!

- అందుబాటులోకి పరీక్ష యంత్రాలు
- సాగు–బాగు ప్రాజెక్టులో భాగంగా సిద్ధం
- ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఏర్పాటు
- తేమ, ఘాటు, రంగు ఆధారంగా ధర పొందే అవకాశం


మిర్చి శాంపిళ్లను పరీక్ష కోసం అందజేస్తున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి నాణ్యత పరీక్ష యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. సాగు–బాగు కార్యక్రమంలో బాగంగా డిజిటల్ గ్రీన్ సంస్థ ఈ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం వాణిజ్య పంటల్లో డిమాండ్ ఉన్న పంటగా మిర్చికి పేరుంది. పత్తి, వరి, అపరాలు వంటి పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా మద్దతు ధరలను ప్రకటించి కొనుగోలు చేస్తుంది. ఈ పంటల కొనుగోళ్లలో పలు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తుంటారు. మసాలా దినుసు పంటైన మిర్చికి వివిధ కారణాలతో మద్దతు ధర ప్రకటించటం లేదు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల డిమాండ్ ఆధారంగా ఈ పంటకు వ్యాపారులు ధర నిర్ణయించి కొనుగోళ్లు చేస్తున్నారు. అనాదిగా మిర్చి పంట నాణ్యత కొలిచే యంత్రాలు లేకపోవడంతో వ్యాపారులు తమ అనుభవాన్ని ప్రామాణికంగా చేసుకొని పంట నాణ్యత, రంగు ఆధారంగా ధర నిర్ణయిస్తున్నారు. పంట నాణ్యతను కొలిచే యంత్రాలు లేకపోవటం, ప్రభుత్వం మద్దతు ధర కూడా లేకపోవటం వ్యాపారులకు కలిసొచ్చిన అంశం. ఇక వ్యాపారులు నిర్ణయించిన ధరకే రైతులు విక్రయిస్తుండడంతో వారికి నష్టాలు తప్పడం లేదు.

'సాగు–బాగు'తో ధర పెరిగేనా..?

ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు ధర కల్పనలో అవరోధాలను అధిగమించేందుకు ఇటీవల పలు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో సాగు–బాగు కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థ మిర్చి నాణ్యత యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం మిర్చి ధర రూ. 20 వేలకు పైగా పలుకుతోంది. పంటకు ధర ఉన్న సమయంలో నాణ్యతా ప్రమాణాల ఆధారంగా కొనుగోళ్లు జరిగితే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సాగు–బాగు ప్రాజెక్టులో భాగంగా మిర్చి నాణ్యతా పరీక్షలు చేయించి, వాటి ఆధారంగా పంటకు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని ఆయా సంస్థలను ఆహ్వానిస్తోంది. గతేడాది ఈ ప్రక్రియ పలు ప్రాంతాల్లో సత్ఫలితాలు ఇవ్వడంతో ఈ సంవత్సరం కూడా మరిన్ని ప్రాంతాలకు విస్తరింపజేసేలా కృషి కొనసాగుతోంది.

ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అమలు

సాగు – బాగు కార్యక్రమంలో భాగంగా మిర్చి నాణ్యత పరీక్షలను ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో నిర్వహించి వాటి ఆధారంగా రైతులకు మేలైన ధర కల్పించటం కోసం ప్రభుత్వం డిజిటల్ గ్రీన్ సంస్థ ద్వారా కృషి చేస్తోంది. రైతులు పండించిన మిర్చి పంట తేమ, రంగు, ఘాటు వంటి అంశాలను సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్షలు నిర్వహించి అందుకు అనువైన ధర కల్పించేందుకు ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అంతేగాక పంట నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు కూడా డిజిటల్ గ్రీన్ సంస్థ సిద్ధంగా ఉంది. ఆ ధ్రువపత్రాల ఆధారంగా రైతులు వ్యాపార సంస్థల్లో అధిక ధర పొందే అవకాశం ఉంది. దీనికి తోడు డిజిటల్ గ్రీన్ సంస్థ పలు సంస్థలను కూడా మిర్చి కొనుగోళ్లకు ఆహ్వానిస్తుంది. ఇప్పటికే 13 ట్రేడింగ్ కంపెనీలు తమకు 300 టన్నుల మిర్చి అవసరమని చెబుతూ కొనుగోళ్లకు ముందుకొచ్చాయి.

రైతు వేదికల్లో ఏర్పాటు

రైతు వేదికలను కేంద్రాలుగా ఎంచుకొని మిర్చి నాణ్యత పరీక్షలను నిర్వహించాలని డిజిటల్ గ్రీన్ సంస్థ నిర్ణయించింది. మిర్చి పండించే ప్రాంతాల్లో ఉన్న రైతు వేదికల్లో ఈ యంత్రాలను అందుబాటులో ఉంచాలని సన్నాహాలు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా సంస్థకు చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పలువురు అనుభవజ్ఞులైన రైతులకు శిక్షణనిచ్చే ప్రక్రియను కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లోని పలు రైతు వేదికల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కొందరు మిర్చి రైతులకు ఈ యంత్రాల నిర్వహణపై శిక్షణలు కూడా ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లాలోని కొరివి, మహబూబాబాద్ రూరల్ ప్రాంతాల్లోని పలువురుకి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు మిర్చి శాంపిళ్లను తీసుకొస్తే 5 నిమిషాల్లో తేమశాతం పరీక్షలు జరిపి వెంటనే వివరాలను వెల్లడించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

తేమ యంత్రాలు, కెమికల్ మిషన్లు..

మిర్చిలో తేమ శాతాన్ని పరీక్షించే యంత్రాలు, ఘాటు, రంగును కొలిచే కెమికల్ మిషన్లను డిజిటల్ గ్రీన్ సంస్థ ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఖమ్మం జిల్లాకు రెండు తేమశాతం కొలిచే యంత్రాలు అందుబాటులోకి రాగా, మహబూబాబాద్ జిల్లాకు ఒక మిషన్ అందుబాటులోకి వచ్చింది. ఘాటు, రంగును కొలిచే మిషన్లు కూడా అందుబాటులోకి తీసుకువచ్చే పనిలో సంస్థ ఉంది. ఈ యంత్రాల ద్వారా 10 నుంచి 12 శాతం తేమ ఉన్న మిర్చిని బెస్ట్ క్వాలిటీగా గుర్తించవచ్చు. ఈ మిర్చిని విక్రయించుకుంటే డిమాండ్ మేరకు ధర వచ్చే అవకాశం ఉంటుంది. లేదంటే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ పెట్టుకునేందుకు ఈ మిర్చికి అర్హత ఉంటుంది. ఇక 13 నుంచి 15 వరకు తేమశాతం ఉన్న మిర్చిని విక్రయించుకునే అవకాశం ఉంది. అంతకు పైగా తేమ శాతం ఉంటే మాత్రం ఆరబెట్టాల్సి ఉంటుంది. అలాగే బస్తాల్లో నింపి ఉంచితే మిర్చి దెబ్బతినే అవకాశం ఉంటుంది.


మిర్చిలోని తేమ శాతాన్ని పరీక్ష చేసే విధానాన్ని వివరిస్తున్న కో–ఆర్డినేటర్

శాంపిళ్లు తీసుకొస్తే వెంటనే పరీక్ష



గ్రామాల్లో మిర్చి శాంపిళ్లను సమీకరించి ఉంచితే ఆయా ప్రాంతాల్లోని రైతు వేదికల వద్దకు చేరుకొని తేమ పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో రైతులు మిర్చి నాణ్యత పరీక్షలు చేయించుకుంటున్నారు. శాంపిళ్ల ఆధారంగా బయ్యర్లు ధర నిర్ణయించి కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ ప్రక్రియ నిర్వహిస్తాం.

– యశోద, సాగు–బాగు ప్రాజెక్టు ఖమ్మం, మహబూబాబాద్ ఇన్‌చార్జి

సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

నేడు ఖమ్మంలో అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ఎర్నేని రామారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సిరిధాన్యాలతో ఆరోగ్యానికి జరిగే మేలుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని కమ్మ మహాజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సిరిధాన్యాలతో తయారు చేసే ఆహారం, లాభాలపై గురువారం జరిగే సదస్సులో స్వతంత్ర శాస్త్రవేత్త, ప్రద్మశ్రీ అవార్డు గ్రహీత ఖాదర్‌వలీ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో రైతు నేస్తం ఫౌండేషన్, కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యాన జరిగే ఈ సదస్సులో ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. అలాగే, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు పలు అంశాలపై మాట్లాడుతారని చెప్పారు. సమావేశంలో కమ్మ మహాజన సంఘం కార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావుతో పాటు నల్లమోతు రఘు, బండి మాధవరావు, డి.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కోయగూడెం ఓసీలో సింగరేణి డైరెక్టర్ పర్యటన


వ్యూ పాయింట్ నుంచి ఓసీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

టేకులపల్లి: సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి బుధవారం ఇల్లెందు ఏరియాలోని టేకులపల్లి మండలం కోయగూడెం ఓసీలో పర్యటించారు. ఈ సందర్భంగా గనిలో పని ప్రదేశాలను పరిశీలించిన ఆయన రోజువారీ ఉత్పత్తి, రవాణాపై జీఎం జాన్‌ఆనంద్‌తో సమీక్షించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తిలో అవరోధాలు ఎదురుకాకుండా చూస్తూ వార్షిక లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఆ తర్వాత కాంట్రాక్టు ఉద్యోగులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో అధికారులు ప్రహ్లాద్, సౌరభ్ సుమన్, నాగేశ్వరరావు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మేడిగడ్డ, కాళేశ్వరంపై చర్యలేవీ?

- కాంగ్రెస్ నేతల మాటలను ప్రజలు విశ్వసించరు
- బీజేపీ నేతలు ప్రేమేందర్ రెడ్డి, ధర్మారావు


మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి, ధర్మారావు

ఇల్లెందు: మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులపై సీబీఐ విచారణ కోరలేదని, ఏ ఒక్కరిపైనా కేసులు పెట్టలేదని, బీఆర్ఎస్ అవినీతిపై విచారణ కోరని కాంగ్రెస్ నేతలు.. ఆ పార్టీతో చీకటి ఒప్పందం చేసుకున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, హన్మకొండ మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడా ఊసే ఎత్తడం లేదన్నారు. అధికారం కోసం అడ్డగోలు వాగ్దానాలు చేసిన కాంగ్రెస్.. ఆ హామీలు అమలు చేసే యోచనలో లేదని విమర్శించారు. రైతు రుణమాఫీ అడ్రస్ లేదని, నిరుద్యోగులకు భృతి మాటే ఎత్తడం లేదని, మహిళలకు రూ.2,500 ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని, తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలువటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని పేదలు బీజేపీకి దగ్గరయ్యారని, 22 కోట్ల మంది భారతీయులు శ్రీరామ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీవీల ద్వారా వీక్షించారని తెలిపారు. దేశంలో 80 కోట్ల మందికి ఉచిత ఆహారం అందించిన ఘనత మోదీకే దక్కిందన్నారు. దేశంలో మోదీ హవా సాగుతోందని, ఏ పార్టీతో పొత్తు లేకుండా రాష్ట్రంలో 8 మంది ఎమ్మెల్యేలను బీజేపీ గెలుచుకుందని చెప్పారు. సమావేశంలో నాయకులు రంగాకిరణ్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాళ్ల సోమసుందర్, బలగాని గోపీకృష్ణ, మావునూరి మాధవ్, కొల్లి సంజీవరెడ్డి, మిర్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.